ప్రకృతి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

కవ్వాల్ అడవుల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జన్నారం, జూన్ 7 :కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ అడవుల్లో ఇషికా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన టైగర్ కన్జర్వేషన్ సొసైటీ వారి ఇన్‌చార్జి వెంకట్ ఆధ్వర్యంలో విద్యార్థులను అడవిలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించారు. అడవిలోని జంతువులు, చెట్లు , మొక్కలపై సమగ్రంగా విద్యార్థుల వివరించి ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. డీ ప్రకాశ్, ఇషికా ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధినేత పంచర్పుల రఘువర్మ పాల్గొన్నారు.

ఎన్ఐడీలో ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

కీర్తనను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు, వికాస తరంగిణి సభ్యులు

చెన్నూర్ టౌన్, జూన్ 7 : రేవెల్లి కీర్తన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ) నేషనల్‌లో 209 ర్యాంక్ సాధించడంతో ఆమెను శనివారం చెన్నూర్‌లో ఘనంగా సన్మానించారు. రేవెల్లి రామయ్య కొడుకు రాజేశ్ కూతురు ర్యాంక్ సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. వికాసత రంగిణి, విశ్వబ్రాహ్మణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరం రమేశాచార్యులు, వికాస తరంగిణి చెన్నూర్ శాఖ అధ్యక్షుడు భీమిని రవీందర్ గౌడ్, పబ్లిక్ కో ఆర్డినేటర్ కట్ల శ్రీనివాసాచార్యులు, మహా లక్ష్మి దంపతులు, నాగరాజు, కీర్తన తల్లిదండ్రులు రాజేశ్, పద్మజ, నానమ్మ తారాబాయి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశాచార్యులు, శ్రీనివాసాచార్యులు, తదితరులు మాట్లాడుతూ చెన్నూర్ వాస్తవ్యురాలు విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ నేషనల్ లెవెల్లో గొప్ప ర్యాంక్ సాధించడం అందరికీ గర్వ కారణమని పేర్కొన్నారు.

‘గాలి మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు’

బెల్లంపల్లి, జూన్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం గాలి మాటలతో గద్దెనెక్కిందని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్ విమర్శించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన బెల్లంపల్లి స్థాయి విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సాధ్యపడని హామీలు ఇచ్చి ప్రజలను నట్టేట ముంచిందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో మాయమాటలు చెప్పిన ప్రభుత్వం ప్రస్తుతం కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. తాజాగా రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్ నిబంధన పెట్టి మరింతగా జాప్యం చేసిందని, అర్హులను పారదర్శకంగా గుర్తించాలనే సాకుతో యవతను మభ్య పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐఐటీ నీట్ ఫౌండేషన్‌లో విద్యార్థుల సత్తా

బెల్లంపల్లి, జూన్ 7: ఐఐటీ నీట్ ఫౌండేషన్ ప్రవేశ పరీక్షల్లో బెల్లంపల్లి సీవో ఈకి చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆకిడి విజయ సాగర్ తెలిపారు. గౌలిదొడ్డి ఐఐటీ ఫౌండేషన్ కోర్సులో డీ.శోభిత్, డీ సిద్ధార్థ, బీ.సాయి సృజన్, చిలుకూర్ ఐఐటీ కోర్సులో కే.నవనీత్, ఉప్పల్ ఐఐటీ ఫౌండేషన్ కోర్సుల్లో డీ.అసిత్, ఎం.శ్రావణ్, డీ.రుతిక్ తేజ, కే.కార్తిక్, ఇబ్రహీంపట్నం ఐఐటీ ఫౌండేషన్ కోర్సులో ఎన్.రుషికేష్, బీ.ఉషాకిరణ్, డీ.వరప్రసాద్, ఎం.పూనమ్‌చందర్, కే.కార్తీక్, పీవీ రాజు సీట్లు సాధించినట్లు పేర్కొన్నారు. వీరిని కళాశాలలో లెక్చరర్లు అభినందించారు.

ఉచిత చేపమందు పంపిణీకి ఏర్పాట్లు

దండేపల్లి, జూన్7: మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా దండేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈ నెల 9న నిర్వహించనున్న ఉచిత చేపమందు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన రంగసాయి ప్రేంసాగర్-భూలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో చేపమందును పంపిణీ చేయనున్నామన్నారు. ఒకరోజు ముందుగానే చేరుకునే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు మహారాష్ట్ర, ఒరిస్సా ప్రాంతాలకు చెందిన వ్యాధిగ్రస్థులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు 9866885308, 9440707416, 9640376530, 9908401985 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వంద పడకల దవాఖాన సందర్శన

బెల్లంపల్లి, జూన్ 7: బెల్లంపల్లి పట్టణంలోని 100 పడకల దవాఖానాను శనివారం కాయకల్ప రాష్ట్ర బృందం సందర్శించింది. దవాఖానలోని పరిసరాలను పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. దవాఖాన ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందికి వారు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు కృష్ణ, సిమ్మి, కవిత, బెల్లంపల్లి దవాఖాన సూపరింటెండెంట్ రవి, వైద్యులు మూర్తి, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టు మునీర్ సంస్మరణ సభ

మంచిర్యాలటౌన్, జూన్ 7: ఇటీవలే మృతిచెందిన సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ సంస్మరణ సభను ఈ నెల 8 న మంచిర్యాల లోని సీఎంఆర్ షాపింగ్‌మాల్ పైన గల సుచిత్ర ఇన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ 143)మంచిర్యాల జిల్లా శాఖ కన్వీనర్ దాసరి ఉమేశ్, కో కన్వీనర్లు చిట్ల రమేశ్, రేణికుంట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సంస్మరణ సభకు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్, టెమ్జూ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, రమణ, యోగానంద్ హాజరవుతున్నారని వారు పేర్కొన్నారు. మునీరన్న యాదిలో ఆదివారం జరిగే ఈ సంస్మరణ సభకు తెలంగాణవాదులు, జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జర్నలిస్ట్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళి అర్పిద్దామని కోరారు.

గుడుంబా పట్టివేత

మందమర్రి, జూన్ 7: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫిల్టర్ బెడ్ ఏరియాలో గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఫిల్టర్ బెడ్ ఏరియాలో గుడుంబా అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనతో పాటు ఏఎస్ఐ మల్లేశ్ సిబ్బందితో కలిసి బానోతు కమల ఇంటి పరిసరాల్లో సోదా చేయగా ఆరు లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు ఆయన తెలిపారు. గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

రెబ్బెన, జూన్ 7: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన ముత్యాల వెంకటేశ్ (27) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..ముత్యాల వెంకటేశ్ మంచిర్యాలలోని మేదరివాడలో వైన్స్‌షాప్‌లో పని చేస్తున్నాడు. శనివారం ఉదయం తిర్యాణిలో ఉండే అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో డబ్బుల కోసం అమ్మమ్మతో వాగ్వాదానికి దిగాడు. మద్యం తాగవద్దని వెంకటేశ్‌ను అమ్మమ్మ మందలించగా మనస్తాపానికి గురయ్యాడు. సమీపంలో జాతీయ రహదారి ఫ్లైఓవర్ కిందకు వచ్చి పురుగుల మందు తాగి, బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. బంధువులు అక్కడికి చేరుకొని వెంకటేశ్‌ను బెల్లంపల్లిలోని దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయమై రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్‌ను సంప్రదించగా తక్కలపల్లి బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం వాస్తవమేనని, ఈ ఘటనా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, అధికారులు

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్.దివాకర్ రావు, బీఆర్ఎస్ నాయకులు

రెబ్బెనలో చిన్నారులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్పీ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ..

నమస్తే నెట్‌వర్క్, జూన్ 6 : బక్రీద్(ఈద్-ఉల్-అజ్‌హా) వేడుకలను శనివారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ప్రవక్త ఇబ్రహీం కుమారుడు ఇస్మాయిల్ చేసిన త్యాగానికి గుర్తుగా, ఆయనను స్మరించుకుంటూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంచిర్యాలలోని కబరస్తాన్ (బస్టాండ్), ఈద్గా (క్వారీ రోడ్డు) వద్ద ఉన్న మసీదుల వద్దకు వెళ్లి ముస్లిం మత పెద్దలు, చిన్నారులందరూ కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, తదితర నాయకులు వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు అలాయ్ బలాయ్‌తో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలో ఈద్గాల వద్ద బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య ఆధ్వర్యంలో, చెన్నూర్ పట్టణంలో ఈద్గాల వద్ద సీఐ దేవేందర్ రావు, ఎస్ఐ సుబ్బారావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. దండేపల్లి, నెన్నెల, తాండూర్, రామకృష్ణాపూర్, జన్నారం, మందమర్రి, సీసీసీ నస్పూర్, వేమనపల్లి మండలాల్లో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రెబ్బెనలో ఏఎస్పీ చిత్తరంజన్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దహెగాం, రెబ్బెన, బెజ్జూర్, కెరమెరి మండలాల్లో వేడుకలను నిర్వహించారు.

టైగర్‌జోన్‌కు వ్యతిరేకంగా పోరాడాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్

మాట్లాడుతున్న బండారు రవికుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 7: జిల్లాలో టైగర్ జోన్ పేరిట రెవెన్యూ భూములను ఫారెస్ట్ భూములుగా మార్చి గ్రామాలను ఖాళీ చేసే కుట్రలను జిల్లా ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ . ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు భూపాల్ పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో టైగర్ జోన్ ప్రకటించడం అన్యాయమని అన్నారు. కేంద్ర బైఖరిని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు పోరాటానికి ముందుకు రావాలన్నారు. టైగర్ జోన్ ప్రయత్నాన్ని విరమించుకోవాలని లేదంటే ప్రజలను ఏకం చేసి పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోట శ్రీనివాస్, ముంజం ఆనంద్ కుమార్, కార్తిక్, మాల శ్రీ, టీకానంద్, సాయికృష్ణ, రాజేందర్ తదితరులున్నారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

- కెరమెరి ఎస్ఐ మధుకర్

మోడి గ్రామ యువకులకు వాలీబాల్ కిట్ అందిస్తున్న ఎస్ఐ మధుకర్

కెరమెరి, జూన్ 7: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్ఐ మధుకర్ అన్నారు. శనివారం మండలంలోని మోడి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలు, డయల్ 100, నకిలీ పత్తి విత్తనాల విక్రయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువతకు వాలీబాల్ కిట్‌ను అందించిన అనంతరం ఎస్ఐ మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, వారు చేసే మాయలోపడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలు, నిషేధిత మత్తు పదార్థాలు ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేంద్రప్రభుత్వం 49జీవోను వెంటనే రద్దు చేయాలి

తిర్యాణి,జూన్ 7: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీవో49ను వెంటనే రద్దు చేయాలని సర్పంచ్‌ల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంతరావు, ఈటీసీ చైర్మన్ తురం గోపాల్ వేరువేరు ప్రకటనల ద్వారా శనివారం డిమాండ్ చేశారు. అనాదిగా అడవులను నమ్ముకుని జీవించే ఆదివాసులను కాదని, ఏనుగులు, పులులు వస్తున్నాయని వాటి సంరక్షణ సాకుతో అడవికి దూరం చేయాలనే కుట్ర పన్నారన్నారు. వ్యవసాయ భూములను సాగు చేయకుండా(టైగర్ జోన్‌ల కన్జర్వేషన్ రిజర్వ్‌డ్)పేరుతో సిర్పూర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో దాదాపు 250కి పైగా గ్రామాల్లోని ఆదివాసులను అడవుల నుంచి వెళ్లగొట్టేందుకు పన్నాగం పన్నారన్నారు. అడవి జంతువులపై ఉన్న ప్రేమ కనీసం ఆదివాసులపై ఎందుకు లేదని ప్రశ్నించారు.అడవులకు ఆదివాసుల మధ్య విడదీయలేని అనుబంధం ఉందన్నారు. దేశంలో ఎక్కడ అడవులు ఉంటే అక్కడే ఆదివాసులు ఉన్నారని తెలిపారు. ఆదివాసుల జీవితాలను చిన్నాభిన్నం చేసేందుకు జీవోను రూపొందించారన్నారు. ఆదివాసులను అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని లేదంటే తమ సత్తా చూపిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తదితరులు ఉన్నట్లు పేర్కొన్నారు.

కీలక ఖనిజాల ఉత్పత్తికి సంసిద్ధంగా ఉన్నాం

- కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖ సదస్సులో సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, జూన్ 7 : దేశ అవసరాలు, వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ కీలక ఖనిజాల ఉత్పత్తికి సంసిద్ధంగా ఉందని సింగరేణి సీఎండీ బలరామ్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కీలక ఖనిజాల సదస్సులో ఆయన సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రణాళికల గురించి వెల్లడించారు. కీలక ఖనిజాల రంగంలోనూ సింగరేణి సంస్థ ప్రముఖ పాత్ర పోషించనుందని చెప్పారు. సింగరేణి బొగ్గు, మట్టి పొరల్లో ఆర్ఈఈ (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) ఉన్నట్లు పలు ప్రాథమిక అధ్యయనాల్లో వెల్లడైందన్నారు. వీటి నుంచి కీలక ఖనిజాల ఉత్పత్తికి అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్‌ను భువనేశ్వర్‌లోని ఐఎమ్ఎమ్‌టీ లేబరేటరీల్లో పరిశీలన జరపగా ఆర్ఈఈ ఎలిమెంట్స్ ఉన్నట్లు నిర్ధారించారన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో కూడా కీలక ఖనిజాలు, ఆర్ఈఈ ఉనికి గమనించినట్లు తెలిపారు. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, నియోబియం ఖనిజాలకు కార్బొనైట్రైట్స్ ప్రధాన ఆధారాలుగా ఉన్నాయన్నారు. రామగుండం ఓపెన్ కాస్ట్ రెండు గనిలో, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఫ్లైయాష్, బాటమ్ యాష్‌లో లైట్, హెవీ రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ కనుగొన్నట్లు చెప్పారు. నేషనల్ జియోఫిజికల్ రీసర్చ్ ఇనిస్టిట్యూట్ (హైదరాబాద్)జరిపిన పరిశోధనలో కూడా రామగుండం ఓపెన్ కాస్ట్ 2గనిలో వెనాడియం, స్ట్రాంటియం, జిర్కోనియం కనుగొనబడిందన్నారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం కీలక ఖనిజాల విషయంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో కోలిండియాతో పాటు ప్రముఖ ఖనిజ ఉత్పత్తి సంస్థలు కూడా పాల్గొన్నాయి.

విద్యార్థులను సర్కారు బడిలో చేర్పించాలి

- బడిబాట కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు

దండేపల్లి : కాసిపేటలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

దండేపల్లి, జూన్ 7 : విద్యార్థులను సర్కారు బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కాసిపేటకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చైతన్యం చేశారు. పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక వసతులు, ఉచిత వసతులు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

బోయపల్లిలో..

తాండూర్,జూన్7: ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడీ ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని కోరారు. ఈ నెల 7నుంచి 10 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంఈవో మల్లేశం తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడం, బడి బయట ఉండే పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. పాఠశాల హెచ్ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులను బడిలో చేర్పించాలి

జన్నారం,జూన్ 7 : జన్నారం, దండేపల్లి మండలాల్లో గిరిజన హాబిటేషన్లలోని విద్యార్థులు ఏ ఒక్కరూ పాఠశాలకు దూరంగా ఉండకుండా ఉపాధ్యాయులందరూ చూడాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఇచ్చిన ఆదేశాల మేరకు శనివారం నుంచి బడి బాట కార్యక్రమాన్ని జూన్19వ తేదీ వరకు నిర్వహించాలని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాజన్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహించి రెండు మండల ఉపాధ్యాయులు సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం కల్పిస్తున్న నాణ్యమైన విద్య, అన్ని వసతుల సౌకర్యాలు, పౌష్టికాహారాన్ని అందిస్తుందని గిరిజగూడాల్లో అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి వచ్చేలాచూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి జీవరత్నం, స్కూల్ కాంప్లెక్స్ ఎస్సీఆర్పీ రఘునాథన్, సెక్రటరీ రాజారాంనాయక్, జన్నారం, దండెపెల్లి మండల గిరిజన పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం : మాట్లాడుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివరాజన్

తాండూర్ : బోయపల్లి లో ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు

రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలి

- సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్

ఎస్ఆర్పీ 3గనిపై రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

శ్రీరాంపూర్, జూన్ 7 : శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 3 గనిలో ఫాటల్ ఫ్రీ జూన్ -2025 నెలగా మార్చడానికి ఉద్యోగులందరూ రక్షణతో కుడిన ఉత్పత్తికి కృషి చేయాలని జీఎం ఎం శ్రీనివాస్ కోరారు. శనివారం గనిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక భద్రత అవగాహన సదస్సులో జీఎం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం జూన్ మాసంలో సింగరేణి సంస్థలో ఎదో ఒక చోట గనిలో ప్రమాదాలు జరిగి కార్మికుల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకే మూడు సంవత్సరాలుగా ప్రతి జూన్ మాసంలో ఫాటల్ ఫ్రీ జూన్ పేరుతో ఉద్యోగుల్లో రక్షణపై అవగాహన పెంచుతామన్నారు. ఉద్యోగుల రక్షణ సంస్థ బాధ్యత అని, ఉద్యోగులు రక్షణతో పని చేయాలని, ఉద్యోగుల రక్షణపై వారి కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని చెప్పారు. రక్షణ అనేది వారి ఇంటి నుంచి ప్రారంభం కావాలని సూచించారు. ఉద్యోగులు భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేసి సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ1, 3 గ్రూప్ గనుల ఏజెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, గని మేనేజర్ వెంకట్రావు, గ్రూప్ ఇంజినీర్ సాంబశివ రావు, గని రక్షణాధికారి మహేందర్, గని సంక్షేమాధికారి సాధన్, పిట్ కార్యదర్శి మురళి చౌదరి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రోస్టర్ రిజష్టర్ వెరిఫికేషన్

శ్రీరాంపూర్, జూన్ 7 : శ్రీరాంపూర్ ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్‌ల్లోని ఎస్సీ, ఎస్టీ ఓస్టర్ రిజిస్టర్లను కార్పొరేట్ కమిటీ సభ్యులు వెరిఫికేషన్ చేశారు. జీఎం ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం ఎం శ్రీనివాస్, ఎస్టీ చీఫ్ లైజన్ ఆఫీసర్ వీ కృష్ణయ్య రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్టీ ఉద్యోగాల ఖాళీల భర్తీ, ఉద్యోగోన్నతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. మిగిలిన ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైజీఎం ఆరవిందరావు, కమిటీ సభ్యులు ఏ భాస్కర్‌రావు, ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరావు, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంతుల, ఏరియా లైజన్ ఆఫీసర్ ఆర్ గుండేరావు, ఏరియా అధ్యక్షుడు హుస్సేన్‌నాయక్, డీవైపీఎం ఎస్‌వీ ఆజేశ్వర్‌రావు, గణేశ్ పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత కీలకం

- బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి

మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, జూన్ 7: బొగ్గు ఉత్పత్తి తో పాటు బొగ్గు నాణ్యత కూడా చాలా కీలకమని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో శనివారం బొగ్గు నాణ్యతపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధిక ఉత్పత్తి సాధించే క్రమంలో బొగ్గు నాణ్యత ను విస్మరించవద్దని, నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ఉన్నదని, ముఖ్యంగా ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లది కీలక పాత్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పీవో శంకర్, పీఈ వీరన్న, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, వెల్ఫేర్ ఆఫీసర్ రజనికుమార్, తదితరులున్నారు.

ఉద్యోగంలో భాగమే బదిలీలు

రెబ్బెన, జూన్ 7: సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు, అధికారులకు ఉద్యోగం లో భాగమే బదిలీలు అని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బెల్లంపల్లి ఏరియా క్వాలిటీ అధికారిగా విధులు నిర్వహించిన గుమాస రవి కార్పొరేట్ కు బదిలీ అయిన సందర్భంగా గోలేటి జీఎం కార్యాలయంలో శుక్రవారం రాత్రి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం బదిలీ